సాక్షి
కామారెడ్డి
బుధవారం ◆ 16 ◆ జూలై ◆ 2025



చెట్లే మానవాళికి జీవనాధారం

మొక్కలను నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 10లో ▸



వేగవంతం చేయండి

గంగమ్మ వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశించారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.5 /22.5

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

సమన్వయంతో అభివృద్ధి సాధిద్దాం



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, వేదికపై ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెరగాలి
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి
- సమీక్ష సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- వివిధ శాఖల పనితీరుపై ఎమ్మెల్యేల అసహనం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క సూచించారు. మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనితా రామచంద్రన్, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు తదితరులు పాల్గొన్నారు. పలు శాఖలపై మంత్రి సమీక్షించారు. వివిధ శాఖల అధికారుల పనితీరుపై ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని, మీరు మంచి చేస్తే ప్రభుత్వానికి మంచి పేరొస్తుందని పేర్కొన్నారు. సమస్య ఉందని తెలియగానే దాన్ని పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. ఒకవేళ సమస్య తీవ్రమైనదైతే ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రుల దృష్టికి తీసుకురావడం ద్వారా అది జఠిలం కాకుండా చూడవచ్చన్నారు. అధికారులు బదిలీ అయినపుడు ప్రజలు కంటతడిపెట్టేలా పనితీరు ఉండాలన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి పల్లెలు, పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, డ్రెయినేజీల్లో మురికి పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డెంగీ వ్యాధి ప్రబలకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.



గజమాలతో మంత్రి సీతక్కకు సన్మానం



మహిళా శక్తి సంబురాల ముగ్గును తిలకిస్తూ..

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెరగాలి..

లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను వేగంగా నిర్మించుకునేలా అధికారులు చూడాలని మంత్రి సూచించారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నవారికి సెర్ప్, డ్వాక్రాల ద్వారా రుణాలు ఇప్పించి సహకరించాలన్నారు. ఇసుక ఇబ్బందులను అధిగమించేందుకు లభ్యత ఉన్న ప్రాంతాల నుంచి ఇసుకను తక్కువ ధరలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణం పనులు మొదలుపెట్టని వారితో మాట్లాడి వారిని ప్రోత్సహించాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా మంజూరైన రోడ్ల నిర్మాణాలకు వెంటనే టెండర్లు పిలిచి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా శక్తి భవనాలను నవంబర్ 19న ప్రారంభించేందుకు సిద్ధం చేయాలన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ భవనాల లెక్కలు తీయాలని, వాటికి సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో 14,500 అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేయడానికి రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో క్రమం తప్పకుండా శానిటేషన్ పనులు చేపడుతున్నామని, వారంలో రెండు రోజులు డ్రైడే నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. నిరుపేదలు ఇళ్లు నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలో జిల్లా నాలుగో స్థానంలో ఉందన్నారు. ఇళ్లు నిర్మించుకోవడం ఇష్టం లేనివారితో మాట్లాడి వారి నుంచి లిఖితపూర్వక పత్రం తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఎస్పీ రాజేశ్ చంద్ర, జిల్లా అటవీ అధికారి నిఖిత, సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఏఎస్పీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్రలు..

కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి ఆర్డినెన్స్ తీసుకువచ్చామని సీతక్క పేర్కొన్నారు. ఇది అమలు కాకుండా కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆమె పైవిధంగా స్పందించారు. కులగణనలో పాల్గొనని కొందరు రిజర్వేషన్ల గురించి మాట్లాడుతుండడం హాస్యాస్పదమన్నారు. మంత్రివర్గంలో నిర్ణయించిన మేరకు ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపామని, ఆయన ఆమోదిస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర పెద్దలతోనూ సీఎం మాట్లాడుతారన్నారు.

డీఎల్పీవో ఎవరో... సెక్రెటరీలు ఎక్కడో..



బాన్సువాడ డీఎల్పీవో ఎవరో కూడా తెలియని పరిస్థితి ఉందని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఏ ఒక్కరూ స్థానికంగా ఉండడం లేదన్నారు. ఉదయం 6 గంటలకు గ్రామాల్లో తిరిగితే సమస్యలు కనబడతాయని, ఎప్పుడో 11 గంటలకు వస్తే ఏం తెలుస్తుందని పేర్కొన్నారు. డీఎల్పీవోనే పనిచేయకపోతే కార్యదర్శులు ఎక్కడ పనిచేస్తారని ప్రశ్నించారు. అధికారులు హెడ్ క్వార్టర్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రికి సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్నవారికి బిల్లులు త్వరగా వచ్చేలా చూడాలన్నారు.

ఇసుకకు అనుమతులివ్వాలి



ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి అవసరమైన మేర ఇసుక తెచ్చుకునేందుకు అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కోరారు. పోలీసు, రెవెన్యూ అధికారులు అనుమతులు లేవంటూ అడ్డుకోవడం సరి కాదన్నారు. నిర్మాణాల్లో ఏమైనా సమస్యలు ఎదురైతే పరిష్కరించి పనులు ముందుకు కదలేలా చేయాలన్నారు. గ్రామాల్లో క్రమం తప్పకుండా శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని, డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌లాంటి వ్యాధులనుంచి ప్రజలను కాపాడాలని అధికారులకు సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

భిక్కనూరు : న్యాయస్థానం ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు చేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క తెలిపారు. ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన తర్వాత తొలిసారి జిల్లాకు వచ్చిన సీతక్కకు మంగళవారం బస్వాపూర్ గ్రామశివారులో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ధ్రువీకరణ పత్రంతో ఇంటికి ఇసుక, మొరం తీసుకోవచ్చన్నారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు మంజూరయ్యేంతవరకు మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపునకు ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించేందుకు ప్రభుత్వం కోర్టును ఆశ్రయించిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు కుంట లింగారెడ్డి, భీంరెడ్డి, అనంత్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సందీప్, శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్ : ఆయకట్టు కింద సాగువుతున్న పంటల కోసం మంగళవారం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదలను ప్రారంభించారు. ప్రధాన కాలువ కింద 1.4 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. మొదటి ఆయకట్టు ప్రాంతంలో వరి నాట్లు వేస్తున్నారు. ఆయకట్టు పంటల కోసం ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు వెయ్యి క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు.

'విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందిస్తున్నాం'

కామారెడ్డి అర్బన్: జిల్లాలో విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందిస్తూ వాటిని పరిష్కరిస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే 24 గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో మారుస్తున్నామని పేర్కొన్నారు. పిడుగుపాటు ఇబ్బందులు లేకుండా నిరోధకాలు బిగించామని తెలిపారు. జిల్లాలో నిర్వహించిన పొలంబాటలో గుర్తించిన వంగిపోయిన, విరిగిపోయిన స్తంభాల స్థానంలో కొత్తగా 1,534 స్తంభాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'



కామారెడ్డి క్రైం: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంతరావు సూచించారు. ఐదు రోజుల క్రితం కామారెడ్డి ఎక్సైజ్ పోలీసులు ఓ గంజాయి విక్రేతను అరెస్ట్ చేశారు. అతడిచ్చిన సమాచారం మేరకు జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గంజాయి సేవనానికి అలవాటు పడిన 31 మంది యువకులను గుర్తించిన ఎక్సైజ్ అధికారులు.. వారికి తల్లిదండ్రుల సమక్షంలో మంగళవారం ఓ పాఠశాల వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజాయికి అలవాటు పడితే కలిగే దుష్ప్రభావాలు, ఆరోగ్య సమస్యలను మానసిక వైద్యుడు రమణ వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ, టాస్క్‌ఫోర్స్ సీఐ సుందర్, ఎస్సైలు విక్రం, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

'బాలసదనం పనులు వేగంగా పూర్తి చేయాలి'



కామారెడ్డి క్రైం : బాలసదనం భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనితా రామచంద్రన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కామారెడ్డికి విచ్చేసిన ఆమె.. పట్టణంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయాన్ని, బాలసదనాన్ని పరిశీలించారు. సంక్షేమ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, డీసీపీవో స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్‌పీవోల సంఖ్య పెంచేందుకు చర్యలు

సుభాష్‌నగర్ : రాష్ట్రంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పీవో)ల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం రైతు ఉత్పత్తిదారుల సంస్థల పెంపునకు సంబంధించి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 311 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా రూపాంతరం చెందాయన్నారు. ఇందులో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో 34(నిజామాబాద్ 12, కామారెడ్డి 22) పీఏసీఎస్‌లు ఎఫ్‌పీవోలు అయ్యాయని తెలిపారు. తద్వారా రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడి సామూహికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్లు, జిల్లా సహకార అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నారుకు ట్యాంకర్ ద్వారా నీరు

భగీరథ ప్రయత్నం చేస్తున్న రైతులు

లింగంపేట: వర్షాభావ పరిస్థితులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పక్షం రోజులుగా వర్షాలు లేకపోవడం బోరుబావులు ఎత్తిపోతున్నాయి. మరోవైపు నీరందక నారుమడులు ఎండుముఖం పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. నారు మడులను కాపాడుకోవడానికి పలువురు రైతులు ట్యాంకర్ల ద్వారా నీరందిస్తున్నారు. భవానీపేట గ్రామానికి చెందిన బ్యాగరి సాయిలు, ఆర్ల బాల సాయిలు అనే రైతులు గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను కిరాయికి తీసుకొని నారుమడికి నీరు పెడుతున్నారు. రాబోయే రోజుల్లో వర్షాలు కురుస్తాయన్న ఆశతో ట్యాంకర్ ద్వారా నీరందిస్తూ నారుమడులను కాపాడుకుంటున్నామని రైతులు తెలిపారు. వర్షాలు కురవకపోతే పెట్టుబడులు మీద పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భవానీపేటలో వరి నారుకు ట్యాంకర్ ద్వారా నీరందిస్తున్న రైతు

పెద్దపులి జాడెక్కడ!

- మూడో రోజూ కొనసాగిన గాలింపు చర్యలు
- అడవిని జల్లెడ పడుతున్నా లభించని ఆచూకీ
- నలుగురి అరెస్ట్, రిమాండ్



రెడ్డిపేట అటవీ ప్రాంతంలో గాలిస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పులి జాడ కోసం అధికారులు చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ మూడో రోజూ కొనసాగింది. ఎస్ 12 నంబరుగల పులి తిరుగుతున్నట్లు నిర్ధారణకు వచ్చిన అధికారులు.. దాని జాడ కనిపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మూడు బృందాలు రామారెడ్డి, మాచారెడ్డి, సిరికొండ మండలాల పరిధిలోని అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. పులి కదలికలను కనిపెట్టేందుకు ఏర్పాటు చేసిన కెమెరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. అలాగే డ్రోన్ కెమెరాలతో అడవిని జల్లెడ పడుతున్నారు. కనీసం దాని కదలికలు దొరికినా అటువైపు వెళ్లాలని ప్రయత్నిస్తున్నారు. పులి ఏ ప్రాంతంలో పశువులపై దాడి చేసిందో ఆ ప్రాంతం నుంచి చుట్టుపక్కల అడవిలో ఉన్న లోయలు, గుట్టల్లో గాలింపు కొనసాగుతోంది. రెస్క్యూ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. మూడు రోజులుగా చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటికైతే సఫలం కాలేదని అటవీ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది.

నలుగురు నిందితుల అరెస్టు

అటవీ ప్రాంతంలోకి అక్రమంగా చొరబడడం, వన్యమృగాలను చంపడానికి ప్రయత్నించిన నేరాలపై రామారెడ్డి మండలంలోని స్కూల్ తండాకు చెందిన నలుగురిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో బూక్య మహిపాల్, గంగావత్ కన్నీరాం, సలావత్ గోపాల్, పిపావత్ సంజీవ్‌లను అరెస్టు చేసినట్టు జిల్లా అటవీ అధికారి నిఖిత తెలిపారు. వారికి 14 రోజుల రిమాండు విధించినట్లు వివరించారు.

సర్కారు బడికి ఊపిరి

- తల్లిదండ్రులతో సమావేశమైన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు
- సొంత డబ్బులతో ఇద్దరు విద్యావలంటీర్ల నియామకం
- పిల్లలను బడికి పంపించేందుకు ఒప్పుకున్న పేరెంట్స్
- పుష్కరకాలం తర్వాత దగ్గి స్కూల్ పునఃప్రారంభం

సదాశివనగర్ : దగ్గిలోని ప్రాథమిక పాఠశాల పుష్కర కాలం క్రితం మూతబడింది. ఆ తర్వాత పట్టించుకున్నవారే లేరు. తాజాగా ఈ పాఠశాలను తెరిపించి ఆదర్శంగా నిలిచారు కల్వరాల్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డి.

సిద్దిపేట జిల్లాకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి బదిలీపై రెండేళ్ల క్రితం కల్వరాల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా వచ్చారు. ఆయన విధుల్లో చేరిన సమయంలో ఆ హైస్కూల్‌లో ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మూతబడే స్థితిలో ఉన్న పాఠశాల గతి మార్చేందుకు ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామాభివృద్ధి కమిటీ సహకారంతో బడి రూపురేఖలు మార్చారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడికి పంపించడం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడి కృషితో ప్రస్తుతం ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 86కు చేరింది.

దగ్గి పాఠశాలపై దృష్టి..

కల్వరాల్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో 17 పాఠశాలలున్నాయి. అందులో దగ్గిలోని ప్రైమరీ స్కూల్ విద్యార్థులు లేక 2013లో మూతబడింది. ఆ బడిని తెరిపించేందుకు ప్రయత్నాలు జరగకపోవడంతో అప్పటినుంచి మూసే ఉంటోంది. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి వచ్చాక ఆ బడిపై దృష్టి సారించారు. గ్రామస్తులతో సమావేశమై చర్చించారు. ఇంటింటికి వెళ్లి పిల్లలను సర్కారు బడికి పంపించాలని కోరారు. ఆయన కృషి ఫలించి 22 మంది విద్యార్థులను బడికి పంపించేందుకు తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. ఈ నేపథ్యంలో విష్ణువర్ధన్‌రెడ్డే సొంత డబ్బులతో పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. బడికి పెయింటింగ్ వేయించారు. విద్యార్థులకు అవసరమైన కుర్చీలు, టేబుళ్లతోపాటు ఆటవస్తువులు కొనుగోలు చేసి అందుబాటులో ఉంచారు. విద్యార్థులకోసం ఇద్దరు విద్యావలంటీర్లను నియమించారు. వారికి ప్రతినెలా రూ. 5 వేల చొప్పున ఆయనే వేతనాలు ఇస్తున్నారు. ఇలా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చేస్తున్న కృషితో పన్నెండేళ్ల తర్వాత బడి మళ్లీ తెరచుకుంది. ఇటీవల డీఈవో ఈ స్కూల్‌ను పునఃప్రారంభించారు.



దగ్గి పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

బాగా పాఠాలు చెబుతున్నారు



మా గ్రామంలో పన్నెండేళ్ల కింద మూతబడిన ప్రాథమిక పాఠశాలను ఈసారి తిరిగి తెరిచారు. ఇప్పుడు ప్రైవేట్ పాఠశాల కంటే మంచిగా చదువు నేర్పిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. పాఠశాలను తెరిపించిన పెద్ద సార్ విష్ణువర్ధన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

-సౌందర్య, విద్యార్థి తల్లి, దగ్గి

మౌలిక వసతులు కల్పిస్తున్నా..



విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేస్తున్నా. సొంత డబ్బులతో వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నా. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి దగ్గిలో మూతబడిన ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభమయ్యేలా చూశా.

- విష్ణువర్ధన్‌రెడ్డి, హెచ్‌ఎం, కల్వరాల్

నేడు తెయూ కాన్వొకేషన్

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాక
- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ రెండో కాన్వొకేషన్ బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. వర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరు కానున్నారని, ఏర్పాట్లను పూర్తి చేశామని వైస్ చాన్స్‌లర్ టీ.యాదగిరిరావు తెలిపారు. రాజ్‌భవన్ నుంచి వచ్చిన పోలీసు అధికారులు, నిజామాబాద్ సీపీ సాయిచైతన్య మంగళవారం క్యాంపస్‌ను సందర్శించి కాన్వొకేషన్ వేదిక వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. స్నిఫర్ డాగ్ స్క్వాడ్ బృందం, బాంబ్ డిస్పోజబుల్ టీం అధికారులు వేదికను నిశితంగా తనిఖీ చేశారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్‌కు చెందిన సిబ్బంది, బ్యాండ్ టీం గవర్నర్‌కు గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ హానర్) సమర్పించనున్నారు. రిహార్సల్స్‌లో భాగంగా ఆర్‌ఎస్సై కే.శ్రీకాంత్ ఆధ్వర్యంలో తెయూ వీసీ యాదగిరిరావు, సీపీ సాయిచైతన్యకు గౌరవ వందనం సమర్పించారు. వీసీ ప్రొఫెసర్ టీ.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, కంట్రోలర్ ప్రొఫెసర్ సంపత్‌కుమార్, డీన్‌లతో కలిపి మాక్ సెషన్ నిర్వహించారు. మాక్ డ్రిల్‌లో కాన్వొకేషన్ నిర్వహణ కమిటీల కన్వీనర్లు, ప్రొఫెసర్లు ఘంటా చంద్రశేఖర్, కనకయ్య, అపర్ణ, ఆరతి, రాంబాబు, ఆంజనేయులు, కె.రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రవీణ్ మామిడాల, అసోసియేట్ ప్రొఫెసర్ నాగరాజు, పీఆర్వో ఏ.పున్నయ్య, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



తెయూ వీసీ, రిజిస్ట్రార్‌లతో కలిసి భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

క్లుప్తంగా

బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయండి



రామారెడ్డి: గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు కాంట్రాక్టరుకు సూచించారు. ఎంతో కాలంగా బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా ఉండడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. వర్షాలు కురిసేలోపు బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు లక్ష్మా గౌడ్, ప్రవీణ్ గౌడ్, పశుపతి, రవితేజ గౌడ్, బడి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో పలు కారణాలతో కుటుంబసభ్యులను కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటానని ఆయన భరోసా కల్పించారు.

నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి



బాన్సువాడ రూరల్: విద్యార్థులు, యువకులు నైపుణ్యాలను మెరుగపర్చుకోవాలని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గంగాధర్ సూచించారు. మంగళవారం కొత్తాబాదిలోని తెలంగాణ మాడల్‌స్కూల్‌లో సేవాసంఘం ఫ్రెండ్స్‌యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేరా యువ భారత్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. జూలై 15న ప్రపంచ యుజన నైపుణ్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. డాక్టర్ విఠల్, వినయ్‌కుమార్, సామాజిక కార్యకర్త నరేష్ రాథోడ్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహాధర్నాకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



సాక్షి నెట్‌వర్క్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగిన మహాధర్నాకు జిల్లా నుంచి ఆ పార్టీ నాయకులు ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరాలని ఈ సందర్భంగా వారు నినాదాలు చేశారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- మహిళా శక్తి సంబురాల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



మహిళా శక్తి సంబురాల్లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



మహిళా సంఘాల సభ్యులతో మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. పట్టణంలోని వెలమ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మహిళా శక్తి సంబురాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సమాఖ్యకు బ్యాంకు లింకేజీ రుణం రూ. 20.56 కోట్ల చెక్కును, కామారెడ్డి నియోజక వర్గంలోని మహిళా సంఘాలకు రూ. 5.28 కోట్ల వడ్డీ రాయితీ చెక్కును, ప్రమాద బీమా కింద ముగ్గురు సభ్యుల కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చొప్పున చెక్కులను అందించారు. మహిళా శక్తి గొప్పదని, మహిళలు అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందినట్టుగా భావించాలని పేర్కొన్నారు.

వనమహోత్సవంలో మంత్రి..

జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ (బాలికల) గురుకుల పాఠశాలలో వనమహోత్సవం నిర్వహించారు. మంత్రి సీతక్క పాల్గొని మొక్కలు నాటారు. మహిళా క్యాంటీన్‌ను సందర్శించిన మంత్రి జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో మాట్లాడారు. ఆర్థికంగా ఉన్నతంగా ఎదగాలని సూచించారు.మంత్రి వెంట ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అటవీ అధికారి నిఖిత, బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి, సెర్ప్ సీఈవో నగేశ్, డీఆర్‌డీవో సురేందర్ తదితరులున్నారు.

ఎస్పీ నుంచి సీపీగా జిల్లా పోలీస్ బాస్

మీకు తెలుసా?



నిజామాబాద్‌లోని సీపీ కార్యాలయం

రాష్ట్ర ప్రభుత్వం 2016 అక్టోబర్‌లో దసరా రోజున ప్రారంభించిన కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలతో పాటు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌ను ఏర్పాటు చేసింది.

- నిజామాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభాను మెరుగ్గా నిర్వహించడానికి, శాంతిభద్రతల సంక్లిష్టతను పరిష్కరించడానికి నిజామాబాద్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (SP)ను, కమిషనర్ ఆఫ్ పోలీస్ (CP)గా అప్‌గ్రేడ్ చేశారు.
- సీపీ నేరుగా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (DGP)కి నివేదిస్తుంది, నిర్ణయం తీసుకోవడాన్ని క్రమబద్ధీకరిస్తుంది. ఒక కమిషనరేట్ నిర్దిష్ట అవసరాలను తీర్చడానికి ట్రాఫిక్, శాంతిభద్రతలు, నేర శాఖలు వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయవచ్చు.
- సీపీ మార్పుతో జిల్లాలోని పోలీసు అధికారుల హోదాల్లో మార్పు వచ్చింది. జిల్లా పోలీస్ బాస్‌ను సూపరింటెడెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) నుంచి కమిషనర్ ఆఫ్ పోలీస్ (సీపీ)గా మార్పు చేశారు.
- జిల్లాలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డీఎస్పీల హోదాల్లో సైతం మార్పు వచ్చింది. నాటి నుంచి నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించే డీఎస్పీలను అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా పిలవడం ప్రారంభించారు.
- జిల్లాలో అదనంగా మెండోర, ముప్కాల్, ఏర్గట్ల, ఆలూర్, డొంకేశ్వర్ పోలీస్ స్టేషన్లు చేర్చబడ్డాయి. సిరికొండ పోలీస్ స్టేషన్‌ను ధర్పల్లి సర్కిల్‌లో విలీనం చేసి నిజామాబాద్ సబ్ డివిజన్ పరిధిలోకి తీసుకున్నారు.

– ఆర్మూర్

అధికారుల తీరుపై అసహనం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సీతక్క బాధ్యతలు స్వీకరించాక తొలిసారి మంగళవారం కామారెడ్డికి వచ్చారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో పాల్గొని వివిధ అంశాలపై సమీక్షించారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ కమిషనర్ అనితా రామచంద్రన్‌తోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారుల పనితీరుపై ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేశారు.

అధికారులెవరూ స్థానికంగా ఉండరు..



జుక్కల్ నియోజకవర్గంలో పోలీసులు తప్ప మరే శాఖల అధికారులు, సిబ్బంది స్థానికంగా ఉండడం లేదని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. అధికారులు కామారెడ్డి, నిజామాబాద్ పట్టణాల నుంచి వచ్చిపోతున్నారన్నారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఏళ్ల తరబడిగా ఒకేచోట ఉన్నా వారిని బదిలీ చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఆస్పత్రుల్లో యాంటీ వీనం ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలని, మద్నూర్ ఆస్పత్రిలో ఆక్సిజన్ యూనిట్‌కు ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని కోరారు. ఇంటి స్థలం లేని పేదలకు స్థలాలు కేటాయించి ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహిళా, శిశు సంక్షేమానికి కృషి



రాష్ట్ర ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటోందని మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ కమిషనర్ అనితా రామచంద్రన్ పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంలో భాగంగా మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసిందన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు దేశంలోనే అత్యధిక వేతనం ఇస్తున్న రాష్ట్రం తెలంగాణనే అన్నారు. టీచర్లు ఉద్యోగ విరమణ పొందితే రూ.2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష ఇస్తున్నామన్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు యూనిఫాంలు అందించబోతున్నామని తెలిపారు. దివ్యాంగులకు ఉపకరణాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ప్రత్యేక పైపులైను వేయాలి



జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణానికి తాగునీటిని సరఫరా చేయడానికి ప్రత్యేక పైపులైను ఉండాలని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణానికి కూడా ఒకే లైను ద్వారా నీరు తీసుకురావడం వల్ల అనేక ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. పట్టణ జనాభా పెరుగుతున్న కొద్దీ అవసరాలు పెరుగుతాయని, ప్రత్యేక లైనుపై ఆలోచనలు చేయాలని మంత్రిని కోరారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక, మొరం సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు.

ఇబ్బంది పెడుతున్నారు



తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలినాళ్లలో నియోజకవర్గంలో 250కి పైగా బోర్లు తవ్వించానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తెలిపారు. వాటికి బిల్లుల చెల్లింపు విషయంలో క్యూసీ పేరుతో ఇబ్బంది పెడుతున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. ఏడాదిన్నరగా చెబుతున్నా పరిష్కారం చూపడం లేదన్నారు. ఎల్లారెడ్డి ఆస్పత్రిలో గైనకాలజిస్టును నియమించాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక ఇబ్బందులు తొలగించాలని అధికారులను కోరారు.

ఆన్‌లైన్ సమస్యను పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కామారెడ్డి టౌన్: భవన నిర్మాణ రంగాల కార్మికులకు సంబంధించి సంక్షేమ మండలి జారీ చేయనున్న లేబర్ కార్డులకు సంబంధించి మీ–సేవ కేంద్రాలలో ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉప్పు సాయికుమార్ మాట్లాడుతూ.. తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లే మానవాళికి జీవనాధారం

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



మొక్కలు నాటుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నస్రుల్లాబాద్/బాన్సువాడరూరల్: చెట్లే మానవాళికి జీవనాధారమని, వాటిని నాటడమే కాకుండా సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం దుర్కిలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల, నర్సింగ్ కళాశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రకృతిని కాపాడుకోవాలని, ప్రకృతిని నాశనం చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్నారు. గతంలో నాటిన ప్రతి మొక్క ఇప్పుడు చెట్టుగా మారి కళాశాల ప్రాంగణం అడవిని తలపిస్తుందన్నారు.

ప్రతి జీవి మనుగడ మొక్కలపైనే: సబ్ కలెక్టర్

ప్రతి జీవి మనుగడ మొక్కలపైనే ఆధారపడి ఉందని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, ఏఎంసీ చైర్మన్ శ్యామల, ప్రిన్సిపాల్ గంగారాం, నాయకులు పెర్క శ్రీనివాస్, వెంకన్న, కృష్ణారెడ్డి, ఎజాస్, పెర్కశ్రీనివాస్, శ్యామల, విఠల్, కంది మల్లేష్, ప్రతాప్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి



కామారెడ్డి టౌన్: జిల్లాలో ఉపాధ్యాయులు, ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని డీటీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో డీఈవో ఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. ప్రతి మండలానికి రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, పీఆర్‌సీ ప్రకటించాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈవోకు సన్మానించారు. డీటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్, రాష్ట్ర కార్యదర్శి హరికిషన్, జిల్లా అధ్యక్షుడు ఎల్లగారి శంకర్, ప్రధాన కార్యదర్శి పెద్దొళ్ల సాయిలు, గౌరవ అధ్యక్షుడు శివప్రసాద్, తదితరులున్నారు.

'డబుల్' ఇళ్లు పంపిణీ చేయాలని వినతి



భిక్కనూరు: మండలంలోని కాచాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు మంగళవారం భిక్కనూరు తహసీల్ కార్యాలయానికి తరలివచ్చారు. 2014లో తొలివిడతలో డబుల్ బెడ్‌రూములను నిర్మింపజేశారని, ఇప్పటి వరకు పంపిణీ చేయలేదని అందులో మౌలిక సదుపాయాలు కూడా లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టరును రప్పించి మౌలిక సదుపాయాలను కల్పించి డబుల్ బెడ్‌రూంలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సునీతకు వినతి పత్రం అందజేశారు.

నీటి స్టోరేజ్ ట్యాంకుల ఏర్పాటు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో నీటి స్టోరేజ్ ట్యాంకులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో కనీస ఏర్పాట్లు లేవని విద్యార్థినులు ధర్నా చేయడంతో కలెక్టర్ డీఎంఎఫ్‌టీ నిధులతో పాఠశాలలో నీటి స్టోరేజి ట్యాంకులు, కొత్త బోర్‌వెల్‌కు కనెక్షన్, ఫ్యాన్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవో షౌకత్‌అలీ సూచించారు. మంగళవారం ఆయన శెట్పల్లిసంగారెడ్డి, లొంకల్‌పల్లి, పర్మళ్ల గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్, బేస్‌లైన్ టెస్టుల రిపోర్టులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఫణికుమార్, ఉమామహేశ్వరీ, రాజేందర్, సందీప్, తదితరులున్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం పరిశీలన

నస్రుల్లాబాద్: సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన 'ఒంటికి రెంటికీ.. బయటకే' అన్న కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఎంఈవో చందర్ నాయక్ పరిశీలించారు. త్వరలోనే నిధులు మంజూరు చేసి పనులు పూర్తయ్యేలా చేస్తామన్నారు.

విద్యుత్ స్తంభం సరిచేశారు

సాక్షి ఎఫెక్ట్..

గాంధారి(ఎల్లారెడ్డి): తుమ్మళ్ల శివారులో ప్రమాదకరంగా మారిన విద్యుత్తు స్తంభాలను ట్రాన్స్‌కో సిబ్బంది మంగళవారం సరిచేశారు. సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో ట్రాన్స్‌కో సిబ్బంది స్పందించి మరమ్మతులు చేసి స్తంభాన్ని సరిచేశారు.

రైతుల సమస్య పరిష్కారం



కామారెడ్డి టౌన్: చిన్నమల్లారెడ్డి గ్రామంలో నెల కొన్న విద్యుత్ సమస్యను అధికారులు మంగళవారం పరిష్కరించారు. గ్రామ శివారులోని వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో పది రోజులుగా రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. నారుమడులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ సోమవారం ఆందోళనకు దిగారు. దీంతో స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం ఉదయాన్నే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించారు. సమస్యను పరిష్కరించామని డీఈ చక్రవర్తి తెలిపారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

సదాశివనగర్: అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సర్దార్ నాయక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్‌హాల్‌లో యూత్ కాంగ్రెస్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌బాబు, భాస్కర్, గంగాధర్, సాయిరెడ్డి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బొలెరో వాహనం బోల్తా



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నాందేడ్–సంగారెడ్డి జాతీయ రహదారిపై మంగళవారం సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం ప్రమాదవశాత్తు బోల్తాపడింది. సంగారెడ్డి జిల్లా బాచేపల్లి నుంచి సిమెంట్ లోడ్ వస్తున్న బొలెరో వాహనం మండలంలోని వెల్గనూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై అదుపు తప్పి, రోడ్డు కిందకు వెళ్లి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహన డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయని హైవే సిబ్బంది తెలిపారు.

సిమెంట్ దుకాణంలో అగ్ని ప్రమాదం



బాల్కొండ: మండల కేంద్రంలోని శాంభవి సిమెంట్ దుకాణంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 10 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అర్ధరాత్రి దుకాణం నుంచి మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారమందించారు. వెంటనే ఫైర్‌సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో వచ్చి మంటలను ఆర్పివేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

చేనులో మూర్చతో రైతు మృతి



లింగంపేట(ఎల్లారెడ్డి): పంట చేనులో పనులు చేస్తుండగా ఓ రైతు మూర్ఛ వ్యాధితో మృతిచెందిన ఘటన మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై దీపక్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన మార్గ రాజు(38) అనే రైతు సోమవారం తన పంట చేనులో పొలం దున్నడానికి వెళ్లాడు. రాత్రి వరకు అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి, వెతకసాగారు. పొలంలో రాజు మూర్చతో బోర్లా పడిఉన్నట్లు గమనించారు. అతడిని లేపి చూడగా అప్పటికే ప్రాణాలు పోయినట్లు గుర్తించారు. మృతుడి కుటుంబసభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. తన భర్త మరణంలో ఎలాంటి అనుమానాలు లేవని అతడి భార్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వర్ని: మండలంలోని శంకోరా గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. వర్ని ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు ఇలా.. శంకోరా గ్రామానికి చెందిన పాల్త్య రవీందర్ ఈనెల 13న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి మంగళవారం ఇంటికి రాగా, ఇంటి తాళాలతోపాటు బీరువా తాళాలు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రెండు తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.18 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యాపారం, బిట్ కాయిన్ పేరిట ఘరానా మోసం

- రూ. 8.50 కోట్లతో పరారైన నగరవాసి
- విచారణ చేపట్టిన సీసీఎస్ పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని అహ్మదీనగర్‌కాలనీకి చెందిన మోహిజ్‌ఖాన్ వ్యాపారం, బిట్‌కాయిన్ పేరిట ఘరానా మోసానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా.. మోహిజ్‌ఖాన్ వ్యాపారం, బిట్ కాయిన్‌లో రూ. 5 లక్షలు చెల్లిస్తే రూ.50 వేలు నెలకు వస్తాయని స్థానిక ప్రజలను నమ్మించారు. కొందరు మోహిజ్‌ఖాన్‌ను నమ్మి రూ. 5లక్షలు చెల్లించడంతో నెలకు రూ.50వేలు చెల్లించాడు. ఇలా కొన్ని నెలలపాటు అతడు పెట్టుబడి పెట్టిన వారికి డబ్బులు చెల్లించారు. ఈ విషయం తెలిసి మరింత మంది అతడికి రూ. లక్షల్లో డబ్బులు చెల్లించారు. ఇలా అతడు సుమారు రూ.8.50 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. పెద్ద మొత్తంలో డబ్బులు రావడంతో ఇటీవల మోహిజ్‌ఖాన్ పరారయ్యారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితులు మంగళవారం రెండో టౌన్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు చేధించడానికి సీసీఎస్ పోలీసులను సీపీ పోతరాజు సాయిచైతన్య ఆదేశించారు. వారు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు.

ఇసుక క్వారీ పనుల అడ్డగింత



సుంకినిలో ఇసుక క్వారీ పనులను అడ్డుకున్న రైతులు

రుద్రూర్: పోతంగల్ మండలం సుంకిని శివారులోని మంజీరా నదిలో ఇసుక క్వారీ ఏర్పాటు పనులను మంగళవారం స్థానిక రైతులు అడ్డుకున్నారు. గత వారం రోజులుగా కొందరు వ్యక్తులు తమకు క్వారీ ఏర్పాటుకు అనుమతి లభించిందని పేర్కొంటూ ర్యాంపు పనులు ప్రారంభించారు. ఇసుక ర్యాంపు ఏర్పాటు పట్ల స్థానిక రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. క్వారీ ఏర్పాటు చేస్తే మంజీర తీరప్రాంతంలో ఉన్న ఎత్తిపోతల పథకాలు వట్టి పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ నిర్వహణ గూర్చి రెవెన్యూ అధికారులకు, స్థానికులకు కూడా ఎలాంటి సమాచారం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను నిలిపివేయాలని నినాదాలు చేశారు. అనుమతులు లేకుండా ఇసుక క్వారీ కోసం ఏర్పాట్లు చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ గంగాధర్ ఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. మూడు టిప్పర్లను సీజ్ చేసి కోటగిరి పోలీస్ స్టేషన్ తరలించారు.

మొరం ట్రాక్టర్, పొక్లెయిన్ సీజ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బాణాపూర్ గ్రామ శివారులోని దండ్ల గుట్టపైన అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నందున సోమవారం రాత్రి మొరం ట్రాక్టర్, పొక్లెయిన్ పట్టుకున్నట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి, వాటిని లింగంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో, మండల కేంద్రంలో అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా మొరం తవ్వకాలు చేపడితే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

డోంగ్లీ మండలంలో మూడు మొరం ట్రాక్టర్లు..

సాక్షి ఎఫెక్ట్..

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని మొగా–డోంగ్లీ ప్రధాన రహదారిపై అక్రమంగా తరులుతున్న మూడు మొరం ట్రాక్టర్‌లను పట్టుకొని సీజ్ చేసినట్లు డోంగ్లీ ఆర్ఐ సాయిబాబా తెలిపారు. సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన 'మొరం అక్రమ తరలింపుపై చర్యలేవి?' అనే వార్త కథనానికి డోంగ్లీ రెవెన్యూ అధికారులు స్పందించారు. ఉమ్మడి మండలంలో అక్రమంగా మొరం, మట్టిని తరలిస్తుండటంతో మొగా గ్రామ శివారులో దాడులు నిర్వహించామని ఆయన తెలిపారు. మండలంలో ఎక్కడైన అక్రమంగా మొరం, మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయనతో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు

- వృద్ధురాలికి గాయాలు

గాంధారి(ఎల్లారెడ్డి): స్తంభం నుంచి విద్యుత్ తీగలు తెగిపడటంతో ఓ వృద్ధురాలికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. మండలంలోని చిన్న పోతంగల్‌లో ఆకిటి భూదవ్వ అనే వృద్ధురాలు మంగళవారం ఉదయం పశువుల కొట్టం శుభ్రం చేసి తిరిగి ఇంటికి వెళ్తుండగా సమీపంలోని విద్యుత్ స్తంభం నుంచి అకస్మాత్తుగా కరెంట్ వైర్ తెగిపడింది. ఆమె భయపడి చేతితో తీగలను పక్కకు లాగే ప్రయత్నం చేయగా, షాక్ గురై పడిపోయింది. స్థానికులు గమనించి కర్రలతో తీగలను తొలగించి ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది తెగిన తీగల స్థానంలో నూతన తీగలను అమర్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

రాహుల్‌తేజపై జిల్లాలోనూ కేసు

ఖలీల్‌వాడి: కొంపల్లి డ్రగ్స్ కేసులో కీలక సూత్రధారి అయిన రాహుల్‌తేజపై నిజామాబాద్ జిల్లాలోనూ గతంలో కేసు నమోదైంది. రాహుల్ తేజ పోలీస్ ఉన్నతాధికారి కుమారుడు కావడంతో రాష్ట్రంలో ఈ కేసు హాట్‌టాపిక్‌గా మారింది. ఈక్రమంలో రాహుల్ తేజపై గతంలో ఉన్న కేసులు వెలుగులోకి వస్తున్నాయి. ఏడాదిన్నర క్రితం రాహుల్‌తేజ మత్తు పదార్థాలను కారులో మహారాష్ట్ర నుంచి తీసుకొని హైదరాబాద్‌కు బయలుదేరాడు. జిల్లాలోని డిచ్‌పల్లి ఎన్‌హెచ్ 44హైవేపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అతడు డ్రగ్స్‌తో పట్టుబట్టాడు. దీనిపై అప్పటి పోలీసులు కేసు నమోదు చేశారు.